
# దగాపడిన తమ్ముడూ.... నీకు దిక్కెవరు?

రాజశేఖర పాండే




"సైలెన్స్"

అన్న జవాను కేకతో కోర్టు ఆవరణలో రణగొణ ధ్వని కొంచెం తగ్గింది. కోర్టు బయటా, లోపలా జనం కిటకిటలాడుతున్నారు ప్రజల్లో సంచలనం కలిగించిన ఈ కేసు తీర్పు వినడానికి జనం తండోప తండాలుగా వచ్చారు.

బోనులో నిల్చున్న నేను కళ్ళెత్తి మెల్లిగా న్యాయాధికారి వైపు చూశాను. పొట్టిగా, లావుగా వున్నాడు. బట్టతల. న్యాయపాలనా యంత్రాంగంలో చిక్కుకుని అబద్ధాలనూ, అన్యాయలనూ వినీ వినీ విసుగెత్తి కాబోలు నిర్వికారంగా, నిర్లిప్తంగా జడ్జిమెంటు తాలూకు కాగితాలు సరిచూసుకుంటున్నాడు. ఆ న్యాయస్థానం క్రింద బెంచి గుమస్తా గోడ మీద బల్లిలా వున్నాడు అక్కడ లాయర్లు తెల్లటి గోడ మీద నల్లటి మచ్చల్లా వున్నారు. దేశంలో దరిద్రంలా బెంచీల నిండా జనం వున్నారు. అందరూ నన్ను కోపంగా చూస్తున్నారు. వారి చూపుల్లో ఆసక్తి, కోపం, అసహ్యం. సానుభూతి లేదు

ఎవరి చూపుల్లో-నేరం జరగడానికి ఈ సమాజం ఎలా పురిగొల్పుతుందో తెలిసినా తెలియనట్లు నటించే పెద్దమనుషులు వీళ్లు. నేరస్తుల్ని తయారు చేసే ఈ సంఘానికి పెద్దలు వీళ్ళు. అసలైన బడా నేరస్తుల్ని తమలో దాచుకుని పిల్లకాకుల్ని వుండేలు దెబ్బతో చంపే ఈ సమాజానికి ప్రతినిధులు వీళ్ళు. "నేరస్తుల్ని సంస్కరించడం ద్వారా నేరాల్ని అరికట్టండి" అన్న నినాదాల్ని కేవలం చదవడానికి వుపయోగించుకొని-గాంధీ మహాత్ముని సూక్తుల్ని వల్లిస్తూ ఆ సూక్తులకు వ్యతిరేకంగా బ్రతకడం నేర్చుకున్న గాంధీ పుట్టిన దేశంలో పుట్టిన ప్రజలు వీళ్ళు.

కళ్ళెత్తి కోర్టు బయటకు చూశాను. అక్కడ జనం మధ్యలో స్థంబానికి జేరగిల పడి నా వైపే చూస్తోంది ప్రమీల. పమ్మీ, ఆ కళ్ళలో ఆవేదన నన్ను చకితుణ్ణి చేసింది. ఆమె ముఖంలో ఆందోళన స్పుటంగా అవుపిస్తోంది. బహుశా ఈ తీర్పు ఎలా వుంటుందో అన్న ఆవేదనలో సతమతమౌతున్నట్లుంది.

నాకు నవ్వొస్తోంది, ఇంత మంది ప్రజల్లో ఈ తీర్పు నాకు అనుకూలంగా వుండాలని కోరుకునేది ప్రమీల ఒక్కతే. ఇంత మంది ప్రజల గోడు నాకు తగుల్తుంటే ఆమె కోర్కె విలువ ఏపాటిది?

నేరము-శిక్ష ఈ గారడీ గమ్మత్తులు బహుశా ఆమెకు తెలిసి వుండవు. న్యాయస్థానాలు ఇతరులు చెప్పింది చెవులతో విని చట్టంతో ఆలోచించి, అధికారంతో తీర్పునిస్తాయనే స్వల్ప పరిజ్ఞానం బహుశా ఆమెకు లేదు కాబోలు.

కాని నాకు మాత్రం నాకు పడబోయే శిక్ష తెలుసు. ఏ ఆధారమూ లేనివాడు, ధనమూ, దర్పమూ లేనివాడు, అధికారం లేని అయోగ్యుడు ఒకరు చెప్పిన న్యాయాన్ని కాదని ఇంకో తీర్పు కోసం ఇంకో న్యాయ స్థానాన్ని ఆశ్రయించలేడు, న్యాయస్థానాలు తిరుగుతూ కాలాన్ని చంపుతూ శిక్షింపబడకుండా చాల కాలం తప్పించుకోవాలంటే చాలా డబ్బుండాలి. డబ్బుంటేనే న్యాయం కోసం వాదించే న్యాయవాదులు ధర్మశాస్త్రాలు తిరిగేసి, ఎక్కడ ఏ లింకువేసి తప్పించుకోవాలో, ఏ మడత పేచి వేసి శిక్ష తగ్గించాలో ఆలోచిస్తారు.

ఆ డబ్బు నా దగ్గర లేదు, కాబట్టి బలగం నా వెనక లేదు. డబ్బు, బలగం లేని వాడి విషయంలో అందరూ చాలా నిక్కచ్చిగా వుంటారు. న్యాయాన్ని కీరు పోకుండా కాపాడుతారు.

కనక నాకు పడే శిక్ష నాకు తెలుసు. అందుకు నాకేవిచారమూ లేదు.

జడ్జి మెల్లగా తన తీర్పు చదవడం ప్రారంభించాడు. ప్రమీల ఒకడుగు ముందుకు వేసి నిల్చుంది. తుఫాను ముందు ప్రశాంతతలావుంది కోర్టులో వాతావరణం. ఒక్కసారి నా మనసు ఎందుకో గతాన్ని తవ్వుకుంటోంది.... ఎందుకో నాకు గతించిన జీవితం గుర్తొస్తోంది.

రజని డాక్టర్. . భూపతి .. పరశురాం.. రాజారావు రామ్మోహన్... అవను . చివరిగా రామ్మోహన్... నా ఈ స్థితికి కారణమతనే!... రా మ్మో ... హ . న్... !!

నేను మెల్లగా ఆలోచిస్తున్నాను.

ఊడ్జి మెల్లగా చదువుతున్నాడు.

ం ం ం

నాతండ్రి వడ్రంగి... నాతల్లి పని మనిషి.

మాతాత ఏదో ఆఫీసులో ప్యూనుగా వుండేవాడట. బహుశా మానాన్న ఏదో ఇంజనీరౌదామని అనుకుని చివరకు వడ్రంగి అయ్యాడు. అందుకే చదువుమీద ఆపేక్ష జాస్తి. చదువుకున్నవాళ్ళంతా రాజాల్లా బ్రతుకుతారనే పిచ్చి నమ్మకం నాన్నది....అందరి మాట ఎలావున్నా తన కొడుకు మాత్రం కలక్టరు అవుతాడని మాఅమ్మి వెర్రి నమ్మకం....నేను కూడా నాన్నకు సాయంగా వడ్రంగం నేర్చుకుని చేతిపని వాణ్నయితే ఈ పాటికి కల్లో గంజో తాగుతూ ఎక్కడో కుర్చీలో, బీరువాలో చేసుకుంటుండేవాణ్ని. నన్నూ చెల్లాయిని పోషించడానికి నాన్న సంపాదన చాలు....కాని నన్ను చదివించాలని నిర్ణయించుకోవడంచేత మాఅమ్మ తనకు అలవాటులేని పాచిపనికి వెళ్ళేది. నాన్న నన్ను వడ్రంగం పని దగ్గరకు రానిచ్చేవాడుకాదు.

"నాన్నా! నేనూ పని నేర్చుకొంటా న్నానా!!" అన్నా నొకసారి... మండి పడ్డాడు నాన్న...."ఛీ!ఛీ! నీకే ఖర్మంరా! రేయ్! సుందరం నువ్వెంతో బాగాచదువుకోవాలి....చెల్లాయికి కూడా నువ్వే చదువు చెప్పించాలి. మీరు పెద్ద పెద్ద వుద్యోగాలు చెయ్యాలి....అపుడు నేనుకూడా ఈపని మానేస్తాను. మీయమ్మ తనపని మానేస్తుంది....వెళ్లు వెళ్ళిచదువుకో" అనేవాడు.

చెల్లాయి బాగా చిన్నపిల్ల....చెల్లాయి నాడిస్తూ....చదువుకొంటూ ఇంటి దగ్గరే వుండేవాణ్ని. అమ్మ తొమ్మిదింటికల్లా పనినుంచి వచ్చి చెల్లాయి నెత్తుకుని నాకు అన్నంపెట్టి బడికి పంపించేది.

అమ్మ అప్పుడప్పుడు ఆమె పనిచేసే ఇంటి దగ్గరనుండి మిగిలిన అన్నంతెచ్చేది. రకరకాల కూరలతో ఆవంటలు బేషగ్గా రుచిగా వుండేవి. ఇంత చక్కని తిండి తినే వాళ్లు ఇంకెంత చక్కగా వుంటారో అనిపించేది నాకు. ఒకసారి అమ్మను అడిగాను నన్ను కూడా తన పనిదగ్గరకు తీసుకెళ్ళమని. అమ్మ నావంక దీనంగా చూసి "వద్దుబాబూ! నువ్వక్కడికి రాకూడదు" అంది ...

అమ్మ అలా ఎందుకన్నదో నాకర్థం కాలేదు. తీసుకెళ్ళమని ఏడ్చి మారాం చేశాను. ఏమనుకుందో అమ్మ సరే అంది. ఇద్దరం కలసి అమ్మ పనిచెసే చోటకు వెళ్లాం.

అది చాలా పెద్ద యిల్లు మేం వెళ్ళేటప్పటికి ఇంకా ఎవరూ నిద్ర లేవలేదు. అమ్మ తలుపు తట్టగానే ఒకావిడ వచ్చి అమ్మ వంక విసుగ్గా చూసి—"ఇంత ఆలస్యం అయిందేం?" అంది కసురుకున్నట్లు....


అమ్మ తలొంచుకుని ఏదో గొణిగింది.

ఆ భూతం నావంక చూసి "ఊ! వీడెవడు?" అంది.

"నా కొడుకమ్మగారూ" అంది అమ్మ.

"ఓ! ఇంతవరకూ చెప్పలేదేం! వీణ్ణి కూడా అయ్యగారిదగ్గరకు పంపకూడదూ పిల్లల్నాడిస్తూ అయ్యగారిపన్లు చేసి పెడ్తాడు" అంది ఆమె.

"లేదమ్మగారూ! బాబు చదువుకుం




టున్నాడు" అంది అమ్మ.

ఆమె ఒక్కసారి ముఖం చిట్లించి అదోలా అమ్మను చూసి లోపలకు వెళ్ళిపోయింది. ఎందుకనో నాకు ఆ వాతావరణం-అమ్మను ఆమె అలా మాట్లాడ్డం నచ్చలేదు.

ఇంతలోపలినుండి ఆమె ఎంగిలి గిన్నెలు తెచ్చి బయటపడవేసింది. అమ్మ ఎంగిలంతా శుభ్రం చేస్తోంది. అమ్మకు సాయం చేద్దామని ఒక గిన్నె తియ్యబోయాను.

"ఆగు....బాబూ! అవి ముట్టుకోకు" అంది అమ్మ కటువుగా.

"ఏమమ్మా? నేనూ తోముతా!" అన్నాను అమాయకంగా.

"నోర్మూయ్యి! అందుకే నిన్ను రావద్దన్నాను. నువ్విలాటి పనులు చెయ్యకూడదు చదువుకోవాలి" అంది అమ్మ కఠిన స్వరంతో.

అమ్మకు తను చేసే పనే నేను చెయ్యబోతుంటే కోపమెందుకు వస్తుందో నాకు అర్థం కాలేదు అప్పుడు.

ఇంతలో లోపల ఒక మగగొంతు ఏదో అడుగుతోంది. బహుశా నాగురించే అనుకుంటాను....

"ఆ! పనిమనిషి కొడుకులెండి!" నిర్లక్ష్యంగా ఆడగొంతు విప్పించింది.

ఎందుకో నా పదేళ్ళ మనసుకు ఆ మాట బాణంలా గుచ్చుకుంది. ఇంతలో ఆ యింటి పిల్లలు నాయీడువాళ్లే వచ్చి దూరంగా నిల్చుని వింతమృగాన్ని చూసినట్లు నన్ను చూస్తున్నారు. వాళ్ల తొడుక్కున్న బట్టలకూ, నా బట్టలకూ చాలా తేడా వుంది. వాళ్లు నన్నో పురుగును చూసినట్లు చూస్తున్నారన్న ఫీలింగ్ కలిగింది.

"పనిమనిషి కొడకు" అనే మాట ఎందుకో నాకు ఏడుపు తెప్పించింది.

అలా అన్న ఆ ఆడమనిషి ముక్కు బ్రద్దలుకొడదామన్నంత కోపం వచ్చింది. మెల్లగా అమ్మదగ్గరకు వెళ్ళి "అమ్మా! ఇక్కడ నే నుండను,...రా వెళ్దాం" అన్నాను. అంతే! ఆ రోజునుండి నే నెపుడూ అమ్మ పనిచేసే చోటికి వెళ్ళ లేదు.

o o o

కాలచక్రం తిరుగతోంది. నేను పెద్ద వాడనవుతుండగా నాన్న పోయాడు. నేను అపుడు టెన్త్ క్లాస్ ప్యాసయ్యాను. చెల్లి ఆరో క్లాసు.

కనీసం అప్పుడన్నా అమ్మ నేనేదన్నా పని చేస్తానంటే ఒప్పుకునివుంటే బావుం డేది. ఊహు . .నసేమిరా వీల్లేదంది. ఏమి అమ్మిందో-ఎవర్ని యాచించిందో తెలియదుగాని నన్ను వారి కాళ్ళూ వీరి కాళ్ళూ పట్టుకొని కాలేజీలో చేర్పించింది.

ఇంటర్ ప్యాసయ్యాను. డిగ్రీలో వుండగా ఒకరోజు కాలేజినుండి ఇంటికి రాగానే మా యింటిముందు జనం గుమి గూడి వున్నారు. పరిగెత్తుకుని వెళ్ళాను. అమ్మ మధ్యలో పడివుంది. రోడ్డుమీద పడిపోయిందట.

అమ్మన తీసుకుని ఆస్పత్రికి పరు గెత్తాను. ఎన్నాళ్లనుండి నానుంచి దాచిందో ఏమో అమ్మకు అధిక రక్తపోటు వుంది. ఇలా చాలాసార్లు పడిపోయివుండొచ్చు. ఎవరికీ చెప్పలేదు. ఇప్పుడు పరిస్థితి విష మించింది.

అమ్మను దక్కించమని వెయ్యిదేవు ళ్ళకు మొక్కుకున్నాను. మొక్కుకున్న మూడవరోజు అమ్మ పోయింది. అమ్మ పోయిన దిగులుతో చెల్లి మంచమెక్కింది. ఆ పిల్ల నా ప్రాణం... ఆ పిల్ల ఆరోగ్యం కుదుటపడాలని మళ్ళీ దేవుళ్ళకు మొక్కు కున్నాను.

ఓరోజు . అర్థరాత్రి చెల్లాయికి తీవ్రమయిన జ్వరం... కలవరిస్తోంది.... నాకు భయమేసింది.... పక్కింటామెను కాపలా వుంచి డాక్టర్‌గారిదగ్గరకు పరు గెత్తాను. తలుపు దబదబ బాదాను.

"ఏమిటోయ్! గొడవ!" అని విసు క్కుంటూ తలుపు తీశాడు డాక్టర్. పరి స్థితి చెప్పాను,

"ఇప్పుడు నన్నేం చెయ్యమంటావ్ ఇదుగో మాత్రలు వ్రాసిస్తాను, తెచ్చి వెయ్యి" అన్నాడాయన.


మాత్రలు వ్రాసిస్తే నేనెక్కడినుండి తేవాలి?

"మందుల షాపులు ఈ అర్థరాత్రి వుండవు డాక్టర్‌గారు! దయచేసి మీరు వచ్చిచూడండి—" ప్రాధేయ పడ్డాను.

"నో! నథింగ్ టు వర్రీ!. నన్ను ట్రబుల్ చెయ్యకు. సరే! నేనే మాత్రలు ఇస్తాను. తీసుకెళ్ళి వెయ్యి—"అని ఏవో మాత్రలు యిచ్చాడు.

పరుగెత్తుకెళ్లి వేశాను. కాని జ్వరం తగ్గలేదు. ఆస్పత్రికి తీసుకెళ్ళమని అందరూ సలహా చెప్పారు. సరే నని ఆ రాత్రివేళ గవర్నమెంటాస్పత్రికి తీసు కెళ్లాను. ముందు "నో అడ్మిషన్ ప్రొద్దుటరా!" అన్నారు-విసుక్కుంటున్న నర్సు కాళ్లు పట్టుకుని ప్రాధేయ పడ్డాను. నాకున్నది ఒకటే చెల్లెలు కావచ్చు.. కాని ఆ నర్సు ఎంత మంది పేషంట్లు- వారి బంధువుల్ని చూసిందో..!

"ఆల్ రైట్! వెళ్ళి డ్యూటీ డాక్టర్




దగ్గరకు వెళ్ళి నీటి రాయించుకు రండి" అంది. డాక్టర్ రూముకు పరిగెత్తాను. డాక్టర్ రూములో లేడ. రెస్ట్ రూములో వుంటాడని అక్కడ వార్డుబాయిని ఆడిగితే చెప్పాడు. రెస్ట్ రూము ఎక్కడో కనుక్కొని అక్కడకు పరుగెత్తాను. రెస్ట్‌లో వున్న డాక్టర్‌ను లేపడానికి వీల్లేదన్నాడు వార్డ్‌బాయి.. మళ్లీ వార్డ్‌బాయ్ కాళ్లుపుచ్చుకున్నాను. చివరకు ఎలా అయితేనేం రెండు గంటల తర్వాత అడ్మిషన్ దొరికింది. ఎమర్జన్సీ వార్డులో చెల్లాయిని డాక్టర్‌కు అప్పజెప్పి బయట బెంచిమీద కూర్చున్నాను ఒంటరిగా.

అపుడు దేవుళ్లకు మొక్కాను చెల్లాయిని బ్రతికించమని!! మొక్కుకున్న మూడు గంటలకు చెల్లాయి పోయిందని చెప్పారు డాక్టర్స్!! నిస్సహాయత! కోపం!! కసి!! తొందరగా ట్రీట్ చేసి వుంటే బ్రతికేదేమో! అది నా ఆశ! కాని ఆమాట అనకూడదు డాక్టర్లతో!! అర్థిస్తే, మొరాలకిస్తారని ఆశ! కాని ఆ దేవుళ్ళు.. అంతా వుత్త ఫార్స్ ఆని వాళ్లని సృష్టించింది మనుష్యులేనని కాల క్రమేణా తెలుసుకున్నాను.

ఆరోజునుండీ నేను ఒంటరిని!

ఆరోజునుండీ నేను దేవుళ్లనూ, సెంటిమెంట్సునూ నమ్మలేదు.

ఆరోజు నుండీ నేను జీవితాన్ని గౌరవించడం మానేసి కేరేజాట్ మనిషిగా తయారయ్యాను.

ం ం ం

ఆలా 'డోంట్ కేర్' గా తయారైనా చదువుమాత్రం విడిచి పెట్టలేదు. స్నేహితుల దయతో—వారాలు చేసుకుని బి.ఏ పూర్తి చేశాను.

బి.ఎ. ప్యాసైన ఆర్నెల్లలోనే నాకు దాని విలువేమిటో తెలిసి వచ్చింది. నా తలిదండ్రులు కలలుగన్న చదువు ఈ

దేశంలో కూడు గుడ్డా సంపాదించడానికి పనికి రావన్న నగ్నసత్యం నాకు బోధ పడింది. వాళ్లు ఒకరకంగా అదృష్టవంతులు. వాళ్ళ జీవితం ధారపోసి చదివించిన కొడుకు చదువు మాత్రమే బ్రతకడానికి సరిపోదని తెలిసి గుండె పగిలిపోక ముందే దాటిపోయారు.

డబ్బులేదు లంచం యివ్వటానికి— తెలిసిన ప్రముఖులు లేరు కాళ్లు పట్టుకుని రెకమెండ్ చేయించడానికి!

మామూలు కథనాది!—పాతకథ.... తరతరాల కథ .. నాలాటి లక్షలాది తమ్ముళ్లు రోజూ ఎదుర్కొంటున్న సమస్య నిరుద్యోగం !!

ఈసమాజాన్ని నిందిస్తూ కూర్చుంటే నాకడుపు నిండదు. పస్తులతో—కడుపు మంటతో—చివరకు దొంగగానో.... మోసగాడిగానో తయారై—బ్రతుకుదామని నిశ్చయించుకున్న నాకు ఆపద్బాంధవుడిలా భూపతి తగిలాడు. అతని దయ వలన నేను చిరుద్యోగినయ్యాను.

భూపతి రెకమెండేషన్‌తో నేను ఒక పెద్ద హోటల్‌లో సర్వర్‌గా చేరాను. మూడు పూట్లా తిండిపెట్టి నెలకు అరవై రూపాయలు ఇస్తారు. సిగ్గూ, బిడియాన్ని ఆకలి తీర్చుకోవడం కోసం పెంటకుప్ప మీద పారేసి ట్రే చేత్తో పట్టుకుని ఉద్యోగంలో జొరబడ్డాను.

"ఏయ్! ఇడ్లీ వేడిలేదేం?" "ఏమోయ్ స్ట్రాంగ్‌కాఫీ" "సర్వర్! నీకు చెముడా? ఒళ్లు కొవ్వెక్కిందా?పూరీ తెమ్మని ఎంత సేపయింది చెప్పి?"

ఇలాంటి చీదరింపు మాటలకు అలవాటు పడిపోయాను. చిటిక వేసి పిలిస్తే పరుగెత్తడం నేర్చుకున్నాను.

కాని ఈ హోటళ్ళలో కూడా పర్మనెంటుగా వుండడానికి వీలు లేదు. మూడు నెలలకొకసారి ప్రొప్రయిటర్ తీసేస్తాడు. అంటే సర్వీస్ బ్రేక్ చేస్తాడు. లేకపోతే గవర్నమెంటు రూల్సు ప్రకారం జీతాలు యివ్వాల్సివుంటుంది. అణిగిమణిగి వుంటే సర్వీస్ బ్రేక్ చేసి మళ్ళీ పెట్టుకుంటారు. లేకపోతే లేదు. లక్షలు సంపాదించినా హోటలుఆసాముల దాహం తీరదు. ఎంత పోరాడినా ఫలితం దక్కదు.


ఇలా సర్వీస్ కట్ అవుతూ మూడు హోటల్సు మారాను. మూడవ హోటలులో పని చేస్తున్నప్పుడు నాకు రాజారావుగారి పరిచయమైంది.

రాజారావు గారు రోజు వుదయం హోటలుకు వచ్చేవాడు - సాధారణంగా నా లైన్లోనే కూర్చునేవారు. ఆయనకేమి కావాలో నాకు బాగా తెల్సు. ఆయన ఆర్డరివ్వకుండానే అన్నీ అమర్చే వాణ్ణి, రాజారావు గార్ని చూస్తేనే కులాసా పురుషుడని తెలిసిపోతుంది. ఎంతో సరదాగా వుంటాడు. అందరిలో ఆయనతో మెల్లగా నా విషయాన్ని చెప్పాను.

ఒక రోజు హఠాత్తుగా ఆయన నన్ను పిలిచి "ఏమోయ్ బార్‌లో పనిచేస్తావా?" అని అడిగారు.

ఏం మాట్లాడాలో తోచలేదు. హోటళ్ళలోనే అందరి జులుం భరిస్తూ పని చెయ్యడం కష్టంగా వుంది. ఇక బార్‌లో అయితే—తాగుబోతుల మధ్య పని చెయ్యాలి. కాని టిప్స్ అవీ బాగా దొరుకుతాయి.

ఒకసారి దిగడం ప్రారంభించిన




తర్వాత దాని లోతుగురించి ఆలోచించడం తప్పు. పని చేసేవాడికి ఎక్కడైనా ఒకటే! అవుద్దేశంతోనే రాజారావుగారికి నాసమ్మతిని తెలియజేశాను. మరునటి రోజు నుండీ "కేబరే&బార్" లో బేరర్ గా చేరాను.

షేడ్‌లైట్ల కాంతి ...పాపపు కూపంలో శాంతి దూతల్లా తెల్లటి డ్రస్సుల్లో వరుగులుతీసే బేరర్లు....మానసికోద్రేకాన్ని రెచ్చగొట్టే ఆర్కెస్ట్రా .. మనిషి వివేకాన్ని అంతం చేసే మందు... ఖుషీ.... నిషా :...వాటి మధ్య పశు వాంఛల్ని రేపే కాబరే నృత్యం....

బిజినెస్ మాగ్నెట్లు—రాజకీయనాయకులు—ధనికులు—జల్సా రాయుళ్లు—విద్యాధికులు—దళారులు... అందరూ రాత్రయ్యే సరికల్లా చేరతారిక్కడకు!.... తెలుగునాటి సంస్కృతిని గురించి కబుర్లు చెప్పే మనవాళ్లు విదేశాల నుండి మనం కష్టపడి కొనుక్కున్న ఈ సంస్కృతిని గురించి విమర్శించరు ...పట్టించుకోరు. చెడతాగి....వంద రూపాయల నోట్లని రూపాయల్లా ఖర్చు చేసే వీళ్ళనుచూస్తే భారతదేశం బీద దేశమంటే ఎవరూ నమ్మరు ...సామాన్యుల సణుగుడు వీరి చెవికి సోకదు.

"బాయ్! రెండు కింగ్ ఫిషర్ బీర్"

'బేరర్....ఆఫ్....మెక్ డోవెల్ విస్కీ'

"జిన్ విత్ ఎల్. సి......మటన్ మసాలా!"

"ట్రిబులెక్స్ రమ్....చికెన్ రోస్టు... క్విక్!"

-రకరకాల అభిరుచులు....రంగు రంగుల ద్రవాలు....ఈలలు! గోలలు!! తుచ్ఛవాంఛల ఘోష!

వీరికి సప్లయి చెయ్యడమంటే కత్తి మీద సాము.. ఏ త్రాగుబోతుకు ఎందుకు కోపమొస్తుందో తెలియదు. ఎందుకు ఎవర్ని కొడతారో, తిడతారో వాళ్ళకే తెలియదు.

తర్వాత కాబరే ప్రకరణం.

ముగ్గురు డాన్సర్లు వంతులవారిగా. ఆర్కెష్ట్రాకనుగుణంగా నృత్యం చేస్తారు తాగుబోతులను కవ్విస్తూ.

ఈ డాన్సర్లు చాలా అందంగా వుంటారు లైట్ల కాంతిలో... వీళ్ళకు వ్యాపార ట్రిక్కులన్నీ తెలుసు. నవ్వు మొఖాన పులుముకొని-హాయలాలికిస్తూ కష్టమర్ల రహస్య కోరికల కనుగుణంగా డాన్సు చేస్తారు. ఈ డాన్సులు చూసే వాళ్లు వెర్రిమొర్రి కోరికలన్నీ కోరుతుంటారు. ఆ సమయంలో ఈ ప్రబుద్ధులకు వాళ్ళ యిళ్లల్లో భార్యలు-చెల్లెళ్లు కూతుళ్లు ఎందుకు గుర్తు రారో తెలియదు. ప్రతి ఒక్కరూ కొనుక్కొన్న ఆనందంతో సంతోషపడదానికి ప్రయత్నిస్తుంటారు.

ఆ డాన్సర్లలో ఒక డాన్సర్ పమ్మీ.. సాధారణంగా డాన్సర్ ఏ జాతివారో- సొంత పేరేమిటో వాళ్లే మర్చిపోతారు. అన్ని రకాల భాషలూ వాళ్లు మాట్లాడతారు, అలాగే పమ్మీ ఎవరో— ఏవూరో నాకు తెలియదు. నేను అడగ లేదు. ఆ అమ్మాయంటే నాకు చాలా అభిమానం. ప్రమీల చాలా మంచి పిల్ల.. విడిగాచూస్తే ఆ అమ్మాయి డాన్సర్ అంటే నమ్మడం కష్టం. ఆ అమ్మయితో నేను చాలా చనువుగా వుండే వాణ్ణి. డాన్సు అయిన తర్వాత డాన్సర్సుకు ముఖ్యంగా ప్రమీలకు నేనే సర్వ్ చేసేవాణ్ణి. ఆ అమ్మాయి వుంటున్న లాడ్జి గదికి తరచు వెళ్తుండే వాణ్ణి. నా కొచ్చినటిప్స్‌లో ఆఅమ్మాయికి మంచి హెయిరాయిల్సు, సెంట్లు కొని ఇస్తుండేవాణ్ణి. తనపై నేను చూపిస్తున్న ప్రత్యేక శ్రద్ధప్రమీల గమనించక పోలేదు.

ఒకసారి అడిగింది

"సుందరం.. నేనంటే నీకెందుకంత యిష్టం?" అని.. "నిజం చెప్పనా? అబద్ధం చెప్పనా?" అన్నాను నవ్వుతూ..

"నిజంగా నిజమే చెప్పు.." అంది కొంటెగా నవ్వుతూ.. మగవాడి అభిమానానికి కారణం ఒకటే.. అది ఆడదాని మీద కోరిక అని ఆ అమ్మాయి అభిప్రాయం..ఇది ఈ సమాజం ఆ అమ్మాయికి నేర్పిన పాఠం.

"పమ్మీ!-నాకు రజని అని ఒక చెల్లెలుండేది.. ఆపిల్ల ఇప్పుడుంటే సరిగ్గా నీలానే వుండేది.. మీది చాలా దగ్గర పోలిక .. అందుకే నువ్వంటే నాకు చాలా యిష్టం—" అన్నాను.

స్థాణువై నన్ను చూస్తుండి పోయింది ప్రమీల. మెల్లగా ఆమె కన్నులను నీటి పొర కమ్మింది..

బేలగా నవ్వుతూ.. "అయితే నాకొక అన్నయ్య దొరికాడన్న మాట-" అంది.

ఆక్షణం నుండీ మాఅనుబంధం మరీ గట్టి పడింది. రాఖీ పండుగ రోజు నా చేతికి రక్షాబంధన్ తొడిగించి. పర్వాలేదు. నే నొంటరి వాణ్ణి కాదు- అన్న ఊహ




నాకెంతో తృప్తినిస్తుండేది...

మా బార్‌లో కస్టమర్లందరి కంటే ధనికుడు, జల్సారాయుడు, పొగరుబోతు రామ్మోహన్.. అతనేం బిజినెస్సు చేస్తాడో నాకు తెలియదు గాని ప్రతి రోజూ బార్‌కు వచ్చి చెడతాగుతాడు. కేబరే డాన్సర్స్ డాన్సు చేస్తున్నప్పుడు అసహ్యంగా వేలతాడు. అతన్ని చూస్తే నాకసహ్యం

ఒకరోజు నన్ను దగ్గరకు పిల్చాడతను.

"ఏమోయ్! సుందరం! ఆ ప్రమీలను ఓ చూపు చూడాలి. బావుంది ... దాని రేటెంతో కనుక్కో" అన్నాడు.

"నేను బ్రోకర్ని కాదు సార్" అన్నాను కోపాన్ని అతి కష్టంమీద అణచుకొని.

"ఓహ్! ప్రియుడవా! అయితే నీ ప్రేయసిని ఒకసారి నా దగ్గరకు పంపించు డబ్బిస్తాను" తన జోక్‌కు తనే విరగబడి నవ్వాడు.

"కొంచెం మర్యాదగా మాట్లాడండి" అన్నాను కటువుగా.

చర్రున లేచాడు రామ్మోహన్.... 'డర్టీ రోగ్! నాకే మర్యాద నేర్పుతావా! చిటికేస్తే, రావల్సిన దరిద్రపు వెధవా! నీకింత పొగరా!" అని యీడ్చి చెంపమీద కొట్టాడ.. మేనేజర్లు, సూపర్‌వైజర్లు పట్టుకున్నారతన్ని. అతనింకా బండబూతులు తిడ.తుండగానే నేను వెళ్లి

పోయాను. బార్‌వాళ్లు కస్టమర్ల నేమీ అనరు. అందునా రామ్మోహన్‌లాటి ఖరీదైన కస్టమర్ని అసలేమీ అనరు.

ఆరాత్రి ప్రమీల డాన్సు చేస్తుండగా విజృంభించాడు అతను. అసహ్యమైన మాటలంటున్నాడు. డబ్బులు విసురుతున్నాడు. అతనిచుట్టూ వున్నవాళ్లు ఎంజాయ్ చేస్తూ అతన్ని ఎంకరేజ్ చేస్తున్నారు.

చటుక్కున లేచి నిలబడ్డాడు రామ్మోహన్. ప్రమీల వున్న స్టేజీవైపు నడిచాడు. ప్రమీల చెయ్యి వడిసి పట్టుకొని ఆమె బ్రాసరీని చేతులతో లాగేశాడు.

"ఏమే! నీకు ఆఫ్టరాల్ ఒక సప్లయర్ ప్రియుడా! ఒళ్ళమ్ముకొనే లం...! నీకెవడు దిక్కో చూస్తాను" అని ఆ అమ్మాయి బట్టలు లాగేస్తున్నాడు. కొంతమంది కేరింతలు కొడ్తున్నారు. కొంతమంది అడ్డు వెళ్తున్నారు. అడ్డువెళ్లిన వాళ్ళను విదిలించి కొడ్తున్నాడు. అతని చేతుల్లో నాకు ప్రమీల కన్పించలేదు. రజని కన్పిస్తోంది. పరుగెత్తుకొని స్టేజీ మీదకు వెళ్లాను.

"మిస్టర్... ఆ అమ్మాయిని వదలండి-'' అరిచాను.

"రామ్మోహన్ రౌద్రంగా చూశాడు. "ఓహో! దీని లవర్‌వా నువ్వు.. ... ఏదీ దీన్ని రక్షించరా"... అని కాలితో తన్నాడు బలంగా. దూరంగా వెళ్లి పడ్డాను. తర్వాత చేతికి ఏమి అందిందో గుర్తు లేదు. రామ్మోహన్ కెవ్వుమని అరవడం వినబడింది. రక్తం నా ఒంటిమీదకు చిందింది. ఎన్ని పోట్లు పొడిచానో గుర్తు లేదు. అందినచోటల్లా పొడిచాను. ఒక నీచుణ్ణి చంపేశాను.

హంతకుడిగా బోనెక్కాను. ఎవరూ ఒత్తిడి చెయ్యకుండానే తప్పు ఒప్పుకొన్నాను.

రామ్మోహన్‌లాటి ధనికుణ్ణి చంపినందుకు ప్రజలు కలవరపడ్డారు. నేను బ్రతకడం ప్రమాదకరమని హాహాకారాలు చేశారు. నాకు జీవితమంటే మోజులేదు. భ్రాంతిలేదు. కాని ప్రమీలలాటి చెల్లెళ్లు ఈ సాలెగూడులోనుండి ఎలా బయటపడతారన్నదే నాదిగులు! వారిని రక్షించే నవసమాజ స్థాపన ఎప్పుడు జరుగుతుందన్నదే నా ప్రశ్న!!

o o o

జడ్జిగారు తీర్పు చివరిభాగం చదువుతున్నారు.

". ......... కనుక ఈ ముద్దాయికి ఫలానాఫలానా సెక్షన్ ప్రకారం ఉరిశిక్ష విధించడమైనది"

ప్రజలు హర్షధ్వానాలు చేశారు. ప్రమీల కెవ్వున అరచి పడిపోయింది... సమాజానికి ఇతోధికంగా సేవ చేసానన్న తృప్తితో జడ్జిగారు లేచారు.

o o o

నాకు ఉరిశిక్ష పడింది. దేశానికి ఒక దగాపడిన దరిద్రుడి పీడ వదిలింది. ★